కాలిపోతున్న పత్తికర్ర

- ఉపయోగాలపై అవగాహన కల్పించని అధికారులు
- ముడిసరుకు ఉన్నా.. మార్కెట్ కరువు
- పత్తికర్ర ఆధారిత పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరుతున్న రైతులు


గుడిహత్నూర్‌లో పత్తికర్ర కాల్చుతున్న రైతులు

గుడిహత్నూర్: ఆసియా ఖండంలోనే పత్తి మార్కెట్‌కు ఆదిలాబాద్ ప్రసిద్ధి. జిల్లాలోని రైతులు ప్రధానంగా పత్తి పంటపై ఆధారపడి జీవిస్తున్నారు. దిగుబడిపై దృష్టి సారించే రైతులకు పత్తికర్ర వినియోగంపై అవగాహన లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. పంట చేతికొతికి వచ్చాక పత్తి కర్రను తొలగించి అక్కడే కాల్చి వేస్తున్నారు. మండలంలో 14,404 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఒక ఎకరాకు సుమారు ఒకటి నుంచి ఒకటిన్నర టన్ను పత్తి కర్ర దిగుబడి వస్తుంది. దీని ప్రకారం సుమారు 22 వేల టన్నుల పత్తి కర్ర అవగాహనలేమితో దేనికీ పనికి రాకుండా పోతోంది. పత్తి కర్రను తగుల బెట్టడం వల్ల రైతులకు తెలియకుండానే మేలు చేసే మిత్ర పురుగులు అగ్నికి ఆహుతావుతున్నాయి. దీంతో రైతులకు కీడు చేసే కీటకాల సంతతి పెరిగి తెగుళ్లు అధికమై రైతులు నష్టపోతున్నారు. ఇదే కాకుండా భూసారం తగ్గిపోయి పంటల దిగుబడి కోల్పోతున్నారు.

అవగాహన కల్పించని అధికారులు..
ప్రభుత్వం ఖరీఫ్‌కు ముందు నకిలి విత్తనాలు, పురుగుమందులు, యంత్రాల వినియోగం, ప్రభుత్వ రాయితీలు వివరించడానికే సరిపోతున్నాయి. రైతుల పంట నుంచి వచ్చే వేస్టేజీని సద్వినియోగపర్చుకొనే దిశగా రైతులకు అవగాహన కల్పించడం లేదు. దీంతో పత్తి రైతులకు మేలు కలగడం లేదు. ఆదిశగా ప్రత్యేక చైతన్య కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నష్టపోతున్న రైతులు
ప్రస్తుతం పత్తికర్ర ద్వారా రైతులు ఎలాంటి లబ్ధి పొందడం లేదు. పైగా చేల నుంచి పీకి తగలబెట్టడానికి ఎకరానికి సుమారు రూ.700 నుంచి 1000 ఖర్చు పెడుతున్నాడు. పత్తికర్ర ముడిసరుకుగా ఆధారపడి పని చేసే ఫ్యాక్టరీలు గనుక అందుబాటులో ఉంటే అదనపు ఆదాయం పొందవచ్చు. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి పత్తి రైతులకు అందుబాటులో పత్తికర్ర ఆధారిత పరిశ్రమలు నెలకొల్పితే రైతుకు నష్టాలను తగ్గించి అదాయం పెంచవచ్చని రైతులు అభిప్రాయపడుతున్నారు.

పత్తికర్రతో ఉపయోగాలు..
పత్తి కర్రను వివిధ రకాలుగా వినియోగించుకోవచ్చు. కర్రను పెద్ద పెద్ద యంత్రాల్లో సైజు బట్టి నుజ్జునుజ్జు చేసి ఫ్లెవుడ్ తయారీ ఉపయోగించవచ్చు. ముఖ్యంగా దీని ద్వారా ప్యాకేజింగ్ పేపరు, అట్టముక్కల తయారీకి ఇది ఎంతో మంచిది. పత్తికర్రను పొడిగా మార్చి వర్మీ కంపోస్టు తయారీ, సేంద్రియ ఎరువుల తయారీతో పాటు పశువుల దాణా తయారీకి వాడుకోవచ్చు. బయోమాయిశ్చర్ పత్తి కర్రల నుజ్జు పంట చేలలో చల్లితే తేమను కోల్పోకుండా ఉంటుంది. తక్కువ వర్షపాతంలో కూడా పంట ఎండకుండా చూస్తూనే.. కలుపు మొక్కలను నివారించవచ్చు. పుట్టగొడుగుల సాగులో సైతం దీనిని ఎరువుగా ఉపయోగించవచ్చు.

చేలలో కాల్చివేస్తున్నాం..



ప్రస్తుతం పత్తికర్రను ఏం చేయాలో రైతులకు తెలియదు. దీంతో చేలలోనే కాల్చి వేస్తున్నాం. ఒక వేళ పత్తికర్ర ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేస్తే పత్తి రైతుకు మేలు జరుగుతుంది. ఆదిశగా ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలు, ప్రయివేటు పారిశ్రామికవేత్తలు, కుటీర పశ్రమల వారితో ఒప్పందం కుదిర్చి పత్తి రైతులకు అనుసంధానం చేస్తే పూర్తిస్థాయిలో సహకరిస్తాం.
– గోండ్ శ్యాం, యువరైతు, కొల్హారీ

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం


నివేదిక చదువుతున్న అధికారి

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. గురువారం ఎంపీపీ పోటే శోభాబాయి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అయితే ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మాత్రం సమస్యలపై ప్రశ్నించలేదు. దీంతో 20 నిమిషాల్లోనే సర్వసభ్య సమావేశం ముగిసింది. నాలుగు సంవత్సరాలుగా సమస్యల పరిష్కారానికి విన్నవించినా.. అధికారులు పట్టించుకోవడం లేదని, దీంతో ప్రశ్నించడం కంటే మౌనంగా ఉండడమే మంచిదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి గ్రామాల్లో నెలకొన్న రోడ్డు, తాగునీటి, మౌలికవసతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధర్, ఎంపీడీవో పుష్పలత, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి


నాయకులతో అభివాదం చేస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

జైనథ్: కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి, రానున్న ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గిమ్మ గ్రామంలో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమన్నారు. డబ్బులు సంపాదించేందుకు రాజకీయాల్లోకి రాలేదని, కేవలం ప్రజాసేవ చేసేందుకు మాత్రమే వచ్చానని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సంతోశ్‌రావ్, శంకర్, సంతోశ్, లక్ష్మణ్, మునిగెల విఠల్, దీపక్ రావ్, పిడుగు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను ఓడించాలి
ఎదులాపురం: రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను చిత్తుగా ఓడించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదిలాబాద్‌రూరల్ మండలం అల్లికోరి, చిచ్‌దరి, ఖానాపూర్ గ్రామాల ఆదివాసీ నాయకులు, ప్రజలతో గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఏఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్ సెడ్మాకి ఆనంద్‌రావు, జ్ఞానేశ్వర్, చంటి, నాగర్కర్ శంకర్, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె


గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న వీవోఏలు

ఉట్నూర్‌రూరల్: సమస్యలను పరిష్కరించే వరకూ సమ్మె చేస్తామని వీవోఏలు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో నిరసన తెలిపారు. అనంతరం ర్యాలీగా వెళ్లి, ఆర్డీవో కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. అనంతరం ఆర్డీవో సురేశ్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నయ్య, వీవోఏ జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తులు మాట్లాడుతూ.. కనీస వేతనం, ఉద్యోగ గుర్తింపు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వీవోఏలు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి వినతి
సిరికొండ: వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని మండల కేంద్రంలోని గాంధీచౌక్ గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని.. గత కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఐకేపీ వీవోఏల మండల అధ్యక్షుడు బోడ్డు దత్తు, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు నివాళి

తాంసి: రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పొన్నారి గ్రామసర్పంచ్ చింతలపెల్లి సంజీవ్ రెడ్డికి పొన్నారి గ్రామస్తులు ఘనంగా నివాళులర్పించారు. సర్పంచ్ అకాల మరణానికి సంతాపంగా గురువారం సాయంత్రం యువజన సంఘం సభ్యులు, గ్రామస్తులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తూ.. సంజీవ్ రెడ్డి అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. అనంతరం పంచాయతీ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అశోక్, వైస్ ఎంపీపీ రఘు, నరోత్తం రెడ్డి, ఆనంద్, సాయినాథ్, భోజన్న యాదవ్ పాల్గొన్నారు.

వినియోగదారుల సమాఖ్య సంఘాలకు టెస్టింగ్ పరికరాలు

కైలాస్‌నగర్: వస్తువుల నాణ్యతను పరిశీలించేందుకు అవసరమైన పరికరాల కొనుగోలు కోసం ప్రభుత్వం జిల్లాలోని మూడు వినియోగదారుల సమాఖ్య సంఘాలకు రూ.10వేల చొప్పున నిధులను మంజూరు చేసింది. దీంతో పాలు, పెరుగు, నూనెలు, పప్పులు వంటి ఆహార పదార్థాలను పరీక్షించేందుకు అవసరమైన టెస్టింగ్ పరికరాలను ప్రతినిధులు కొనుగోలు చేశారు. గురువారం జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎన్.నటరాజ్ తన కార్యాలయ ఛాంబర్‌లో వాటిని విడుదల చేశారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్‌వో కిరణ్‌కుమార్, డీడీ మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సప్తాహం


మాట్లాడుతున్న సునీత వెంకట్

తలమడుగు: మండల కేంద్రంలోని పూలాజీ బాబా ఆలయ ఆవరణంలో నిర్వహించిన సప్తాహ వేడుకలు గురువారం ముగిశాయి. సీనియర్ పిరమిడ్ మాస్టర్ సునీత వెంకట్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ శ్వాస మీద ధ్యాసతో ధ్యానం చేయాలన్నారు. ధ్యానంతో మానసిక ఒత్తిడి నుంచి విముక్తి పొందవచ్చన్నారు. అనంతరం ఎంపీడీవో రమాకాంత్ మాట్లాడుతూ.. ప్రజలు భక్తిమార్గంలో ప్రయణించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ మాస్టర్ మహేందర్ యాదవ్, కాటిపల్లి సురేశ్‌రెడ్డి, నిలగిరి అశోక్, కాటిపల్లి సునీతరెడ్డి, భూమయ్య, రాధమ్మ, ఇంద్రక్క, భోజమ్మ, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

నేటి నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం
కైలాస్‌నగర్: దత్తత గ్రామాల్లో విద్యుత్ మరమ్మతులు చేపడుతున్నందున ఈనెల 19నుంచి 15 రోజుల పాటు పట్టణంలోని విద్యానగర్ కాలనీలో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం కలుగుతుందని పట్టణ సౌత్ ఏఈ సదానందం ఒక ప్రకటనలో తెలిపారు. కాలనీవాసులు గమనించి విద్యుత్‌శాఖకు సహకరించాలని కోరారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం
నేరడిగొండ: మండలంలోని కుమారి గ్రామంలో శుక్రవారం శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం నిర్వహించడం జరుగుతుందని ఆలయకమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగే కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

21నుంచి పశువుల సంత
బేల: మండలంలోని చప్రాల గ్రామంలో ఈనెల 21నుంచి ప్రతీ ఆదివారం పశువుల సంత నిర్వహించనున్నట్లు సర్పంచ్ మేస్రాం దౌలత్ పటేల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసంతలో ఎద్దులు, ఆవులు, మేకలు, గొర్రెలు, దేశీకోళ్ల కొనుగోళ్లు, అమ్మకాలు జరుపుకోవచ్చని పేర్కొన్నారు. చుట్టూ పక్కల గ్రామాల రైతులు, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మొక్కల సంరక్షణకు చర్యలు


మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నేరడిగొండ: మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ అన్నారు. గురువారం మండలంలోని కొర్టికల్(బి), చింతగూడ గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎండలు ఉన్న దృష్ట్యా గ్రీన్ మ్యాట్ వినియోగించాలని సూచించారు. అలాగే ప్రతిరోజు మొక్కలకు నీరందించి ఎండిపోకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఆయన వెంట సర్పంచులు, ఉపాధిహామీ టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.

క్లుప్తంగా

జిల్లాకు కేంద్ర జలశక్తి పురస్కారం

కైలాస్‌నగర్: ఆజాదీకా అమృత్ మహోత్సవంను పురస్కరించుకొని భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వ శాఖ జలవనరుల సంరక్షణ, నిర్వహణ రంగంలోని వివిధ వర్గాలకు 2022 సంవత్సరానికి గాను 4వ జాతీయ నీటి అవార్డుల విజేతలను ప్రకటించింది. ఉత్తమ జిల్లా విభాగంలో ఆదిలాబాద్ జిల్లాకు జాతీయస్థాయిలో మూడో ర్యాంక్ లభించింది. ఈమేరకు ఆశాఖ సెక్రటరీ పంకజ్ కుమార్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. ట్రోఫీ, ప్రశంసాపత్రంతో సత్కరించనున్నట్లు తెలిపారు.

వితంతు పింఛన్ అందించాలి

నేరడిగొండ: అర్హులైన వారికి వితంతు పింఛన్ అందించాలని గిరిజన లంబాడా ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తులు చేసుకొని ఎదురుచూస్తున్న వారికి నిరాశే ఎదురవుతుందన్నారు. విడో పింఛన్ అందించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినా.. ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు 10,360 మందికి అందలేదన్నారు. వెంటనే పింఛన్ అందించి బాధిత మహిళలను ఆదుకోవాలని కోరారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

బోథ్: మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మరో రెండు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు బోథ్ సెంటర్ ఇన్‌చార్జి నాగభూషణ్ తెలిపారు. ఇప్పటికే బోథ్ మార్కెట్ యార్డులో కొనుగోళ్లు చేపడుతుండగా.. రైతుల సౌకర్యార్థం బోథ్ మండలంలోని కనుగుట్ట, నేరడిగొండ మండలంలోని కుమారిలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే కొత్త సెంటర్‌లలో కొనుగోళ్లు జరిగే అవకాశం ఉందన్నారు.

బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్‌గా రాకేశ్

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ గ్రామానికి చెందిన గాజుల రాకేశ్‌ను బీజేవైఎం బోథ్ నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్‌గా నియమించినట్లు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మనంద్ తెలిపారు. గురువారం నియామక పత్రాన్ని తన నివాసంలో అందజేశారు. బజార్‌హత్నూర్ సోషల్ మీడియా కన్వీనర్‌గా కుమ్రం శ్రీరాం, కోకన్వీనర్‌గా గాజుల సురేశ్‌ను నియమించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సోన్‌టాకే గజానంద్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

ఇంద్రవెల్లి: క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని ఎంపీపీ పోటే శోభాబాయి అన్నారు. ఇటీవల నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడకారులకు గురువారం బహుమతులు ప్రదానం చేశారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పుష్పలత, సర్పంచ్‌లు కోరెంగా గాంధారి, లఖన్, స్వర్ణలత, ఆశాబాయి పాల్గొన్నారు.

పేదింటి యువతి పెళ్లికి చేయూత

నార్నూర్: పేదలకు చేయూత అందించేందుకు శ్రీ సంత్ సేవా సమితి సేవాభావంతో పని చేస్తోందని సమితి అధ్యక్షుడు సందీప్‌రాథోడ్ అన్నారు. గురువారం నాగల్‌కొండ గ్రామానికి చెందిన రాథోడ్ లలి తబాయి నూర్‌సింగ్ దంపతులు కూతురు రాథోడ్ అశ్విని పెళ్లి చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో రూ. 5వేలు, అదే గ్రామానికి చెందిన జాదవ్ సురేశ్ కవితకు రూ. 5వేలు అందజేశారు.

తేమ పేరుతో కోత విధించొద్దు

ఖానాపూర్: వరిధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే పంటలో అధికారులు తాలు, తప్ప, తేమ పేరిట కోతలు విధించి రైతులకు నష్టం చేయవద్దని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గోవింద్ అన్నారు. గురువారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20వేల పరిహారం ప్రభుత్వం చెల్లించాలన్నారు. లేకపోతే లంబాడా హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

కంటివెలుగు శిబిరం

ఖానాపూర్: మండలంలోని రాజురా గ్రామంలో కంటివెలుగు శిబిరాన్ని గురువారం సర్పంచ్ చిన్నం లావణ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజు, డాక్టర్ శ్రీవిద్య, ఉప సర్పంచ్ పద్మ, ఎంపీవో చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన బి.జలేందర్‌గౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అతడితో కలిసి పదో తరగతి చదివిన మిత్రులు గురువారం అతడి ఇంటికి వెళ్లి రూ.15వేల ఆర్థికసాయం అందించారు.

అటెన్షన్ ప్లీజ్..

పొంచి ఉన్న ప్రమాదం



తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని గ్రామ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. గత కొన్ని నెలలుగా విరిగిన విద్యుత్ స్తంభం అలాగే ఉండడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి నూతన స్తంభం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.
– సంబంధిత అధికారి: శ్రావణ్ కుమార్, విద్యుత్ ఏఈ భీంపూర్, ఫోన్: 83310 17768

‘అక్రమాలు బయటపెడుతాం’



మాట్లాడుతున్న రాళ్ల బండి మహేందర్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ అక్రమాలను బయటపెడుతామని బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి రాళ్లబండి మహేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం మాట్లాడారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అవినీతిని బీజేపీ పట్టణ కార్యదర్శి గంద్రత్ మహేందర్ ప్రశ్నిస్తే ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. బీజేపీ కార్యకర్తను రౌడీషీటర్ అంటూ సంబోధించడం సరికాదన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గుట్కా, మట్కా, అక్రమ కలప రవాణా వ్యాపారాలు చేస్తూ కోట్లకు పడగలెత్తారని ఆరోపించారు. బీజేపీ కార్యకర్తలను ఇబ్బందులకు, బెదిరింపులకు గురిచేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు సాయి, రాకేష్, గోపి, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంతంలో విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ముత్నూర్ గురుకుల పాఠశాలలో ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 2 కోట్ల, 70లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ప్రతీ మండలాల్లో గురుకుల పాఠశాలలు, మోడల్ స్కూల్స్ నిర్మించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పోటే శోభాబాయి, ఏఎంసీ చైర్మన్ జాదవ్ శ్రీరాంనాయక్, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, సర్పంచ్ తుమ్రం బాగుబాయి, కోరెంగా గాంధారి, విజయ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌నకు విద్యార్థుల ఎంపిక


ప్రియ

నేరడిగొండ: నేషనల్‌మీన్స్ కమ్‌మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు నేరడిగొండ జెడ్పీఎస్ఎస్ విద్యార్థిని సోలంకి ప్రియ ఎంపికైనట్లు ఎంఈవో భూమారెడ్డి తెలిపారు. ప్రతీ సంవత్సరం దేశ వ్యాప్తంగా 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ 2022–23 పరీక్షలో నేరడిగొండ జెడ్పీఎస్ఎస్ విద్యార్థిని ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

బోథ్: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన 9మంది విద్యార్థులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఉమేష్‌రావు తెలిపారు. హర్ష, సిద్దు నాయక్, స్రవంతి, అస్మిత, స్నితిక, హర్షిత, రాజేశ్వరి, అమృత్ కృష్ణ, శ్రీరాంలు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు


డీలర్లకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రవీందర్

తలమడుగు: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి ఏడీఏ రవీందర్ హెచ్చరించారు. గురువారం మండలంలోని సుంకిడి గ్రామంలో రైతువేదికలో విత్తన డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన విత్తనాలను రైతులకు విక్రయించాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన తరువాత తప్పకుండా రైతులకు రసీదు ఇవ్వాలని సూచించారు. దుకాణంలోని స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు బోర్డుపై రాయాలన్నారు. కార్యక్రమంలో ఏవో మహేందర్, డీలర్లు, ఏఈవోలు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సాకటి దశరథ్

బజార్‌హత్నూర్: రాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ అన్నారు. గురువారం మండలంలోని చందునాయక్‌తండా గ్రామంలో పలువురికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం తమవిగా ప్రచారం చేసుకుంటుందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడే మానాజీ, మాధవ్‌రావ్ ఆమ్టే, సూర్యకాంత్‌గిత్తే, చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్, బత్తిని సుధాకర్ యాదవ్, భీంరెడ్డి, బాబారావ్, మడవి ప్రకాశ్, పెరుగు సంతోశ్ పాల్గొన్నారు.

సన్మానం

ఎదులాపురం: సత్యసాయి యూనివర్సిటీ నుంచి ఎడ్యుకేషన్ విభాగంలో ఎగ్జిక్యూటివ్ ప్రాక్టికల్ అప్రోచెస్ ఫర్ చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్ అనే అంశంపై డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కోల కిరణ్‌కుమార్ డాక్టరేట్ పొందారు. ఈసందర్భంగా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని మాధవ నిలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ సల్లా విజయ్‌బాబు, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వలభోజు గోపికృష్ణ, అల్లూరి మనోజ్ రెడ్డి, యాదవ్‌రావు, మెట్పల్లి గోపాలకృష్ణ, సింగిడి వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు.